గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా విద్యార్థులకు ఆసక్తికరంగా ఉండేందుకు ఈ ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని, ఇందులో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజున బహుమతులను ప్రదానం చేయనున్నట్టు గ్రంథాలయ అధికారి సునీత చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

అపరిశుభ్రంగా రహదారి

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని మామిడి చెట్టు వద్ద వీధి రోడ్డు బురద నీటితో అధ్వానంగా ఉంది. సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించక పోవడంతో ఆ పరిసర నివాస గృహాలు వారు ఉపయోగిస్తున్న వాడుకనీరు మామిడి చెట్టు వీధి రోడ్డు వద్ద నిల్వ ఉండిపోతుంది. దీంతో, దీంతో, దోమలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వస్తుండడంతో ఆ పరిసర నివాస గృహాల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ వీధి గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దోమల కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు మరింత ఎక్కువగా నిల్వ ఉండటంతో పూర్తిగా బురదగా ఉండటంతో నడుచుకొని వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. తక్షణమే అధికారులు స్పందించి సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బురదమయంగా ఉన్న రోడ్డు

విష జ్వరాలు ప్రబలుతున్న గిరిజన ప్రాంతాల్లో

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- చింతపల్లి: విష జ్వరాలు విస్తరిస్తున్న గిరిజన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు అత్యవసరమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లిలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, పార్టీ నాయకులు గడుతురు సత్యనారాయణ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. మారుమూల గిరిజన గ్రామాల్లో పదుల సంఖ్యలో జ్వర బాధితులు ఉన్నారని, జలుబు, జ్వరం, తలనొప్పి, పొడి దగ్గు వంటి లక్షణాలతో గిరిజనులు మంచాన పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ, స్థానిక ఐటీడీఏ అలసత్వం ప్రదర్శిస్తున్న తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలు తీవ్ర బాధలు పడుతుంటే, వారు మౌనంగా ఉండటం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోజూ పదుల సంఖ్యలో జ్వర రోగులు చేరుతుండగా, అవసరమైన ఔషధాల సరఫరా సరైన రీతిలో జరగడం లేదని, మెడికల్ షాపులలో అధిక ధరలకు మందులు అమ్ముతున్నారని చిన్నయ్యపడాల్ మండిపడ్డారు. బాధితులకు ఉచితంగా 10 కేజీల బియ్యం, 2 కేజీల కందిపప్పు, 1 కేజీ పంచదార, 1 లీటర్ వంట నూనె ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాలతో కలుషిత నీరు తాగడంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జల్ జీవన్ మిషన్ పథకం అమలు కూడా నామమాత్రంగా జరిగిందని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా బోర్లు తవ్వించి పైపులు వేయడంతో పనులు ఆగిపోయాయని, మోటార్లు అమర్చకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. ఈ పనుల్లో భారీ అవినీతి జరిగిందని, దీనిపై త్వరలోనే పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వాలు గిరిజనులకు సురక్షితమైన నీరు అందించలేకపోతే, వారికి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు అయ్యే వరకు సిపిఎం పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అపూర్వభరత్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి-మోతుగూడెం : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ తెలిపారు. చింతూరు మండలం, మోతుగూడెంలో ఏపి జెన్కో గెస్ట్‌హౌస్ సమావేశ భవనంలో జెన్కో ఐటిడిఎ అనుబంధశాఖలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మోతుగూడెం డ్రైనేజీ, ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాభూములు, తాగునీరు, జెన్కో గెస్ట్‌హౌస్ సమస్య గురించి చర్చించారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణం కోసం సదరు జెన్కో తహశీల్దార్‌తో చర్చించి వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యొక్క భూమి గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. మోతుగూడెంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. పొర్లేక్యాంప్, ఒడియాక్యాంప్, ఐంతలూరువారు, తడికవాగు గ్రామాల్లో విద్యుత్ సదుపాయం కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. 2016లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయిన వాటి గురించి అడగ్గా దానిని సంబంధించిన శాఖతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెన్కో చీఫ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జెన్కో తహశీల్దార్, చింతూరు, ఎంపిడిఒ, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం ఉద్యమం

మాట్లాడుతున్న స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కోసం ఉద్యమం తప్పదని ఈ నెల 25న భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ బుధవారం వెల్లడించింది. ప్రభుత్వంతో దప దపాలుగా జరిగిన చర్చలలో భాగంగా ఈనెల 20న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్పెషల్ డిఎస్సి పై 100శాతం ఉద్యోగాల రిజర్వేషన్ పై చర్చిస్తారని భావించామని, అటువంటి చర్చ లేకపోవడంతో ఈనెల 25న భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఈ మెగా డీఎస్సీలోనే 5 షెడ్యూల్ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని, లేనిపక్షంలో 5 షెడ్యూల్ ప్రాంతంలో పోస్టులన్నీ మినయించి ప్రత్యామ్నాయ జీవో ఇచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డి ఎస్ సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించింది. ఈనెల 25న జరుగు సదస్సు లోగా అన్ని మండలాల్లో ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో మండల సదస్సులు ఏర్పాటు చేసి అన్ని మండలాల్లో గల ముఖ్యమైన నాయకులతో ఈనెల 25వ తారీఖున కార్యాచరణ రూపొందిస్తామనీ ప్రకటించింది .ఈ కార్యక్రమంలో ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా చైర్మన్ కుడుముల కాంతారావు జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన్న పడాల్ కో కన్వీనర్ కూడా రాధాకృష్ణ సలహాదారులు సలీం మాస్టర్ చీకటి నాగేశ్వరరావు గారు కోకన్వీనర్ వంతల నాగేశ్వరరావు భాను సిహెచ్ రావు ధనుంజయ్ ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

రహదారి మరమ్మతు చేపట్టాలి

-గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని లోతు గెడ్డ వంతెన నుంచి కోటగున్నల, నిమ్మపాడు మీదుగా కోరుకొండ వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో స్థానికులు బుధవారం ఉదయం పెద్దఎత్తున రోడ్డుపై నిరసనకు దిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో లోతుగడ్డ వంతెన నుంచి కోరుకొండ వరకు రహదారి పూర్తిగా శిధిల వ్యవస్థకు చేరి చిత్తడిగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలకు ఈ దారి అసలు ఉపయోగపడని స్థితికి చేరిందని, అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కోటగున్నల వద్ద రహదారి మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. చిన్నపాటి వర్షాలకే రహదారి వాడుకకు లేకుండా పోతే, రాబోయే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేమని ఆందోళన వ్యక్తం చేశారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ చినబాబు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని జడ్డంగి ఎస్ఐ చినబాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్సై చినబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. రాజువొమ్మంగి జడ్డంగి రహదారి మీదుగా వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు గూర్చి వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్సు, వాహన రికార్డులు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనదారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మోదకొండమ్మ జాతర బుధవారంతో ముగిసింది. మూడురోజుల పాటు ఆంధ్ర ఒడిస్సా మైదానం ప్రాంతం వ్యాపారులు, భక్తులతో కిటకిటలాడింది.అవాంఛనీయ సంఘటనల జరగకుండాఉత్సవ కమిటీ అధ్యక్షులు కె బొంజుబాబు, కార్యదర్శి టి చక్రదర్, సర్పంచ్ పి మాధవరావు, స్థానిక నాయకులు రాబాబు, గంపరాయి సూరయ్య, పోలీసు సిబ్బంది సహకారం అందించారు

ఘటాలను మోస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

దేవీపట్నం - ప్రజాశక్తి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రంపచోడవరం మండల న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వాలంటిర్ కో కన్వీనర్ యలగాడ నాగేశ్వరరావు తెలిపారు. లయ సంస్థ వ్యవస్థాపకులు డానిమిక్, నపీజా జ్ఞాపకార్థం వాలీబాల్ కిట్లు పంపిణి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కొండదొరల సంఘం జిల్లా నాయకులు దూసరి హరిబాబు మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యక్రమాల వైపు దృష్టి మరల్చకుండా క్రీడాసామగ్రి ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, మండలానికి, జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్, పారాలీగల్ వాలంటీర్, కన్వీనర్ తెల్లంశేఖర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆడుకునేందుకు గ్రామగ్రామాన క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి, క్రీడా సామగ్రి ఇచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. క్రీడారంగంలో కూడా ఆదివాసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారం రామన్న దొర, సిద్ధబత్తుల రవి, కానూరు సత్యనారాయణ, యలగాడ నాగ కోటప్ప, మేక భాను, దూసరి రమేష్, మూలపర్తి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

శారదానికేతన్‌లో ప్రవేశాలకు ప్రచారం

ప్రజాశక్తి-అనంతగిరి:ఇంగ్లీష్ మీడియం తో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ములియగూడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అడ్మిషన్లకు సిపిఎం జెడ్పిటిసి .గంగరాజు ఆధ్వర్యాన బుధవారం ములియగుడ, పూలగూడ, .రాయవలస,. టోకూరు, అనంతగిరి, బొర్రాలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అనంతగిరి మండలం ములియగుడ గ్రామంలో ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కె.మొస్య, గిరిజన సంఘం నాయకులు గెమ్మెల. దేవన్న, శారథ ట్రస్ట్ సిబ్బంది దొన్ను, .బాబురావు, అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పార్వతీపురంలో గురువారం జరగనున్న అరకు పార్లమెంటు స్థాయి మహానాడుకు టిడిపి శ్రేణులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే, పాడేరు టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. పాడేరులోని కుమ్మరిపుట్టులోని తన నివాసంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 22న గురువారం సాలూరులో జరిగే అరకు పార్లమెంట్ స్థాయి మహానాడుకు తరలి రావాలని కోరారు. ఈ మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ జడ్ పిటిసిలు, ఎంపిపిలు ఎంపిటిసిలు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీలు, పంచాయతీ, గ్రామ కమిటీ అధ్యక్షులు, టిడిపి, ఎన్ టిఆర్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్ఐ వెంకటరమణకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-చింతపల్లి:అల్లూరి మన్య ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తూ వ్యాపార లావాదేవీలు నిర్వహించిన పాత నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేసిన చింతపల్లి ఎస్సై ఎం వెంకటరమణకు గుర్తింపు లభించింది. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పాత కేసుల ఆధారంగా నిందితులను గుర్తించాలని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పి నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి గంజాయి పాత నేరస్తులను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ విశేష ప్రతిభకు గుర్తింపుగా అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ చేతుల మీదుగా వెంకటరమణకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరై ఎస్సై వెంకటరమణ సేవలను ప్రశంసించారు.

ప్రశంసా పత్రాన్ని ఇస్తున్న ఎస్‌పి

ఏజెన్సీలో విద్యాభివృద్ధికి పెద్దపీట

కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో విద్యాభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేశాయని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రంపచోడవరం సమీపంలో కస్తూరిబా ఆశ్రమ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల శంకుస్థాపన, శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమానికి కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్, రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం మండలం నెల్లిపూడి, రాజవొమ్మగి కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాలల్లో అదనపు తరగతి భవనాలకు సర్వశిక్ష పథకం ద్వారా ఒక్కొక్క భవనానికి ఒక కోటి 60 లక్షల రూపాయల వ్యయంతో అదనపు తరగతి భవనాలు మంజూరు చేశారని తెలిపారు. భవనాలు నాణ్యతగా నిర్మించి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. రంపచోడవరం, నెల్లిపూడి, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాల్లో కస్తూరిబా జూనియర్ కళాశాలల అదనపు తరగతి భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం కస్తూరిబా జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం పదోతరగతిలో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయిన బాలికలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు పండ వెంకటలక్ష్మి, పల్లాల కృష్ణారెడ్డి, ఎంపిపి బంధం శ్రీదేవి, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, పెంటపాటి అనంతమోహన్, సలాది బాపిరాజు, సూర్యనారాయణరాజు, జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ వి.ఎస్.స్వామినాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి. రాజ్యలక్ష్మి, షేక్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే శిరీషాదేవి

కాంట్రాక్ట్ వర్కర్లకు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్టిసి ద్వారకా బస్టాండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ (స్వీపర్స్), అద్దె బస్సు డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, విశాఖ జిల్లా ఆర్టిసి ప్రజారవాణాసంస్థ (ఆర్‌ఎం) కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎస్ ఆర్టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ లేబర్‌యాక్ట్ ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్‌కి ఆర్టిసి కాంట్రాక్టర్స్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. ద్వారక బస్టాండ్ స్వీపర్స్‌కు రూ.10,554 చెల్లించవలసి ఉండగా కేవలం రూ.9,200 వేతనం మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఒక్కొక్క కార్మికుని దగ్గర సుమారు రూ.1300 కాంట్రాక్టర్ తీసుకోవడం అన్యాయమన్నారు. సర్క్యులర్ ప్రకారం మొత్తం వేతనం కాంట్రాక్టర్ కార్మికులకు చెల్లించాలన్నారు. సంవత్సరానికి 9 సెలవులు ఉండగా, ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తక్షణం వారికి లేబర్‌యాక్ట్ ప్రకారం వేతనాలు, సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ కార్మికులకు నష్టమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ (స్వీపర్స్) ఉపాధ్యక్షుడు డి.లక్ష్మ, హైర్ బస్‌డ్రైవర్స్ జాయింట్ కార్యదర్శి వి.అర్జున్, కాంట్రాక్ట్ కార్మికులు,అద్దె బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం ఎల్ఐసిదరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వేతనం రూ.18,500 చెల్లించి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. యజమాని వాటా పిఎఫ్, ఈఎస్ఐను యాజమాన్యం చెల్లించాలన్నారు. చట్టప్రకారం వీక్లీఆఫ్, పండగ, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సతీష్, ప్రధాన కార్యదర్శి పి. ఆనంద్, బి. రాజులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పి.మణి తదితరులు

గండి పోచమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు

దేవీపట్నం - ప్రజాశక్తి : మండలంలోని గొందూరులో గండి పోశమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవదాయ ధర్మదాయ శాఖాధికారులు, ప్రభుత్వ శాఖాధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, మీడియా సమక్షంలో బుధవారం తెరచి లెక్కించారు. 10 నెలల 6 రోజులకు రూ.6,42,563 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వరరావు జూనియర్ అసిస్టెంట్ రాజమహేంద్రవరం దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వంగలపూడి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మనోజిత్ సర్కార్, పోలీస్ సిబ్బంది, వంగలపూడి ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, దేవీపట్నం మండల అధ్యక్షుడు చారపు వెంకటరాయుడు, కలువ శ్రీనివాస్‌దొర, చంద్రకుమార్, రాము పాల్గొన్నారు.

గండి పోశమ్మ అమ్మవారు

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : 2025 డిఎస్‌సి నుంచి ఏజెన్సీ ఆదివాసి పోస్టులు మినహాయించి 100 శాతం స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేసేందుకు ఆదివాసి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ మరియు సాంస్కృతిక సంఘం జిల్లా నాయకులు సమర్త కృష్ణ డిమాండ్ చేశారు. ఐటిడిఎ ఎదుట ఏడో రోజు నిరాహారదీక్ష ఆదివాసి జెఎసి కోర్ కమిటి సభ్యులు మట్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమర్త కృష్ణ మాట్లాడుతూ తక్షణమే (టిఎసి)ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. 29 శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టి బాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తదితర సమస్యలపై ఆదివాసి జెఎసి తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఆదివాసి కొండరెడ్ల సంఘం నాయకులు గోము కృష్ణ, పల్లాల లక్ష్మణ్ రెడ్డి, పొత్తూరు సత్యనారాయణ చవలం శుభకృష్ణదొర, ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్నదొర, కె.రత్నకుమారి, ఎస్.రాజకుమారి,కె.ధనలక్ష్మి,కె.రమణరెడ్డి, కె.సుమంత్ రెడ్డి,కె.రత్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైనే పశువుల సంచారం

అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు

తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పట్టని వైనం

రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న పశువులు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి - పాడేరు ప్రధాన రహదారి మార్గంలోని చెరుకుంపాకలు, లోతుగడ్డ గ్రామాలలో రోడ్డుపై పశువుల సంచారం పెరిగి పోయింది. ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పశువులు రహదారులపై నిద్రించడమే కాకుండా స్వేచ్ఛగా తిరుగుతూ వాహనదారులకు తీవ్ర అంతరాయంగా మారుతున్నాయి. పశువుల యజమానులు వాటిని వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో, ప్రతి రోజూ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా చీకటి సమయాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హుకుంపేటలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-హుకుంపేట: జాతీయ భద్రతలో ప్రజలు భాగ్యస్వాములు కావ్వాలని బిజెపి అల్లూరు మాజీ అధ్యక్షులు పాంగి. రాజారావు అన్నారు. మండల కేంద్రంలోని ఆపరేషన్ సింధూరు విజయాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాంబే. బాలకృష్ణ, సర్పంచులు బాకూరు వెంకటరమణ, తామర్ల సత్యనారాయణ, పాండు రంగస్వామి, పాడి బాలన్న. మండల అధ్యక్షుడు పాంగి గసన్న పాల్గొన్నారు.

జిరాక్స్ షాపులో చోరీ

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అంబేద్కర్ విగ్రహం సమీపంలో జిరాక్స్ షాపులో దుండగలు చోరీకి పాల్పడ్డారు. షాప్ వెనకాల భాగం రేకులను తొలగించి నగదు, వస్తు సామగ్రి దోచుకున్నట్లు షాప్ యజమాని రెడ్డి సత్యనారాయణ బుధవారం విలేఖరులకు తెలిపాడు. స్థానిక ఎస్ఐ కొల్లి రమణకు పిర్యాదు చేయగా పరిశీలించారు.

జూ పార్కులో వేసవి శిబిరం ప్రారంభం

వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, జివిఎంసి, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, గ్రీన్ పాజ్, యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్ వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో జూ పార్కులో ఐదు రోజుల వేసవి శిబిరాన్ని బుధవారం జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజుల పాటు విద్యార్థులకు వన్యప్రాణుల ప్రపంచాన్ని తెలుసుకోవడానికి, అన్వేషించడానికి, అనుసంధానం చేసుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశంగా ఉంటుందన్నారు. జంతువులతో పాటు వాటిని ఆదరిస్తున్న ప్రకృతి పట్ల అవగాహన కలిగించేలా కార్యక్రమాలు రూపొందించినట్టు తెలిపారు. ఈ శిబిరం ద్వారా చిన్నారులకు జంతువులు, వాటి సంరక్షణపై ఆసక్తి కల్పించి, అనుభవాత్మకమైన, పరస్పర చర్యల ద్వారా అవగాహన పెంపొందించే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై పెరుగుతున్న దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దళితులపై జరుగుతున్న దాడులు తక్షణం ఆపాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పలంపాడులో దళితులపై సాంఘిక బహిష్కరణ జరిగి దాన్ని మరిచిపోక ముందే, తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను చిత్రహింసల పాలు చేసి రౌడీషీటర్లు చంపడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి మాట్లాడుతూ ఈ నెల 18న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం డొంకాడలో దళితులు టెంట్‌హౌస్ పనులు చేస్తుంటారని, ఆ గ్రామంలో జి.వి.లచ్చుబాబు వివాహంలో వారి సెల్‌ఫోన్ పోయిందని, దళితులే చోరీ చేశారని వారిని కొట్టారన్నారు. ఎందుకు కొడుతున్నారని దళితపెద్దలు వెళ్లి అడగ్గా వారిపై కూడా మారణాయుధాలతో దాడిచేశారన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ అధికార పర్యటనలో మహారాష్ట్రకు వెళితే అక్కడి బిజెపి ప్రభుత్వం అవమానించిందన్నారు. దళితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి మారకపోతే, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డిక్సన్ టెక్నాలజీస్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: భారతీయ డొమెసైల్ కంపెనీ నెక్స్‌సెల్ ఇండియా డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా) లిమిటెడ్‌తో అనుబంధ సంస్థ అయిన ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్)తో కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ ఒప్పందం చేసుకుంది. ప్రసిద్ధ ఫ్రెంచ్‌టెక్ బ్రాండ్ ఆల్కాటెల్ యొక్క స్మార్ట్‌ఫోన్‌ల తయారీకి భారత్‌లో ఎకోసిస్టమ్‌ను స్థాపించడం మళ్లీ లాంచ్ చేయడం ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశమని నెక్స్‌సెల్ ఇండియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంశ్ రాథీ తెలిపారు. బుధవారం ఈస్ట్‌పాయింట్ కాలనీలో వారి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం అభివృద్ధి చెందుతున్న డిజిటల్ తయారీ రంగంలో ఒక కీలకమైన దశగా నిలుస్తోందని భారతీయ వినియోగదారుల కోసం ప్రీమియం, గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే స్మార్ట్‌ఫోన్‌లను అందించడంలో సహాయ పడుతుందన్నారు.

శిశువుతో వైద్యులు, వైద్య సిబ్బంది

550 గ్రాముల శిశువుకు ప్రాణం పోసిన వైద్యులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అత్యంత తక్కువ బరువుతో జన్మించిన శిశువుకి ప్రాణం పోశారు. కేవలం 550 గ్రాముల బరువు మాత్రమే ఉన్న ఆడ శిశువుకు చికిత్స చేసి రక్షించారు. వంధ్యత్వంతో పాటూ అధిక రక్తపోటు కలిగిఉన్న తల్లికి ఈ శిశువు జన్మించింది. గర్భం దాల్చిన కేవలం 25 వారాలకే జన్మించిన ఈ అసాధారణ శిశువు ఇప్పుడు ఆరోగ్యంగా ఉంది. 35 రోజుల తరువాత 1.7 కిలోల బరువుతో, సాధారణ మెదడు దృష్టి పనితీరు కలిగి ఉంది. దీంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పాప తల్లి లండన్ ఐవిఎఫ్ సెంటర్‌లో చాలా సంవత్సరాల చికిత్స తర్వాత గర్భం దాల్చింది. అక్కడ వైద్యుల రిఫరెన్స్ మేరకు విశాఖలోని మెడికవర్‌లో చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయిసునీల్‌కిషోర్‌ను సంప్రదించగా డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీరంగ నర్సింగ్ బృందంతో అహర్నిశలు శ్రమించి శిశువును కాపాడామని డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ తెలిపారు.

ఘనంగా యోగాంధ్ర మాసోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురష్కరించుకొని యోగాంధ్ర 2025లో భాగంగా బుధవారం స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ఇండోర్ స్టేడియంలో కర్టెన్ రైజర్ ఈవెంట్ అఫ్ యోగను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా ప్రాథమిక లక్ష్యం మనస్సు, శరీరం, ఆత్మలను ఏకం చేయడం ద్వారా ఆ వ్యక్తి సమగ్ర శ్రేయస్సును సాధించగలమని తెలిపారు. యోగాలో శారీరక భంగిమలు, శ్వాస పద్ధతులు, ధ్యానాన్ని ఏకీకృతం చేయడంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత భావోద్వేగ సమతుల్యత, ఆధ్యాత్మికత వృద్ధి చెందుతాయన్నారు. విధి నిర్వహణలో ఉన్న వారు ఒత్తిడులకు లోను కాకుండా విధులు నిర్వర్తించ గాలుగుతారని తెలిపారు. నెల రోజుల పాటు అందరూ యోగ సాధన చేయాలని, జూన్ 21 అంతర్జాతీయ యోగా డే నాడు ఉత్తమ యోగ సాధకులకు అవార్డులు అందించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు.

సంయుక్త కలెక్టర్, ఐటిడిఎ ఇంచార్జ్ పిఒ ఎం జె అభిషేక్ గౌడ మాట్లాడుతూ, కొన్ని వేల సంవత్సరాల క్రితం యోగా సాధన మన దేశంలోనే ఉద్భవించిందని, అందులో సత్ఫలితాలు ఉన్నందునే క్రమ క్రమంగా అంతర్జాతీయ గుర్తింపు పొంది అన్ని దేశాలు యోగా సాధనకు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. కలెక్టర్, జేసి, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కె.పద్మ లత, డిఎంహెచ్ఓ జమాల్ బాష, అధనపు డిఎంహెచ్ఓ టి.ఎన్.ప్రతాప్, డిఇఓ పి. బ్రహ్మాజీరావు, డిఆర్డిఎ పిడి, హౌసింగ్ పిడిలు వి.మురళి, ఎ.బాబు, డిపిఆర్ఓ పి.గోవిందరాజుల, డిఎంఓ తులసి, ఎస్డిసి ఎంవిఎస్ లోకేస్వరరావు, ఎపిసి స్వామినాయుడు, డిఎస్డిఓ జగన్మోహన్‌రావులు యోగా సాధన చేసారు.

అనంతగిరి:మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగ కార్యక్రమం ప్రారంభించామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ వివి .కుమార్ అన్నారు. యోగా చేయడంతో మానసికంగా ధ్రుఢంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి దిసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో ఘనంగా యోగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు నిర్వహించారు.ఏ.టి.డబ్ల్యూఓ జయ నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు లోచలి వరలక్ష్మి పాల్గొన్నారు.

చింతపల్లిలో ర్యాలీ చేపడుతున్న ఎంపిపి, అధికారులు

రంపచోడవరం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రతి వ్యక్తి ప్రతిరోజూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ యోగా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో మానవహారం నిర్వహించి యోగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 21 నుంచి జూన్ 21 వరకూ గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీలను నియమించి యోగా అవగాహన కార్యక్రమాలు ఎక్కడికక్కడ నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నామ న్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జనరల్ డి.ఎన్.వి. రమణ, పరశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డిఇఒ వై. మల్లేశ్వరరావు, డిఎల్‌పిఒ పద్మ, ఎంపిడిఒ యస్.శ్రీనివాసరావుదొర, తహశీల్దార్ పి.రామకృష్ణ, సిడిపిఒ సంధ్యారాణి, ఎఇ సత్యనారాయణ, ఎస్ఒ మార్తమ్మ, అగ్రికల్చరల్ అధికారి కె.లక్ష్మణ్, రంపచోడవరం పంచాయతీ కార్యదర్శి రమేష్, ఐటిడిఎ మేనేజర్ బి.రాజు, ఫిజికల్ డైరెక్టర్ భవాని, ఎపిఎం రాము సోమేశ్వరస్వామి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగాడే సందర్భంగా సిబ్బంది యోగా సాధన బుధవారం నిర్వహించారు. ప్రతి వ్యక్తి కనీసం గంటసేపు యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయాధికారి చక్రధర్, ఎంఇఒ సూరయ్యరెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అరకులోయ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన ప్రెస్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయ:ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) అరకులోయ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎల్‌బి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు అతిథి గృహంలో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాలకు చెందిన (ఏపీయూడబ్ల్యూజే) ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా విశాఖ ఉమ్మడి జిల్లా రూరల్ మాజీ అధ్యక్షులు సి.హెచ్.బి.ఎల్ స్వామి సమక్షంలో అరకులోయ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎంపిక జరిగింది. నూతన కార్యవర్గంలో అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఎల్ బి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా రావుపల్లి రవి, ఉపాధ్యక్షులుగా దురియా గోవర్ధన్, విలియం కేరి, లక్ష్మణరావు, ఎస్ సోమేశ్వరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్ ఆనంద్, కృష్ణ బాబు, శ్రీను, కోశాధికారిగా అనిల్, సహాయ కోశాధికారిగా సంజీవరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అరకులోయ ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులుగా కె రమేష్ బాబు, ఎస్.కె రెహమాన్, సహా సంయుక్త కార్యదర్శులుగా దూరియా ప్రశాంత్ కుమార్, కె హరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు పాత్రికేయల సంక్షేమం కొరకు ఏపీయూడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఏపీయూడబ్ల్యూజే రూరల్ మాజీ అధ్యక్షులు సి హెచ్ బి ఎల్ స్వామి, అనకాపల్లి ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు విజయ్ నీలాద్రి, జిల్లా నాయకులు బి. నాగరాజు, సత్యనారాయణ, ప్రభుదాసు, శ్రీనివాస్, రాజేష్ మాట్లాడారు.నూతన కార్యదర్శి ఆర్. రవి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఖ్యాతిని రెట్టింపు చేసేలా యోగా మాసోత్సవాలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: అంతర్జాతీయ స్థాయిలో విశేషమైన గుర్తింపు కలిగిన విశాఖ మహానగరం విశిష్టతను, ఖ్యాతిని రెట్టింపు చేసేలా అంతర్జాతీయ యోగా దినోత్సవాలను అందరం కలిసికట్టుగా నిర్వహించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక ఆర్‌కెబీచ్ వద్ద యోగాంధ్ర నెలావారీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ వేడుకను రికార్డుస్థాయిలో నిర్వహించేందుకు అందరినీ సిద్ధం చేస్తున్నామన్నారు. టిఒటిలకు వారి ద్వారా మిగిలిన వారికి యోగా శిక్షణ అందించేందుకు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ద్వారా సర్టిఫికెట్లు అందజేసేందుకు, తదుపరి ప్రక్రియలు నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. ప్రజలంతా ఈ నెల రోజులు జరిగే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సూచన మేరకు యోగా మంత్‌లో భాగంగా శిక్షణ, ప్రత్యేక యోగా, జలయోగా, అంధులకు నిర్వహించే యోగా వంటి ప్రక్రియలు నిర్వహిస్తామన్నారు.

యోగా మాసోత్సవాలు

మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసోత్సవాలు నిర్వహి స్తామని జూన్ 21న ప్రధాన కార్యక్రమంలో ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు భాగస్వామ్యం అవుతారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందిని, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మే 21 నుంచి జూన్ 15 వరకు శిక్షణ, జూన్ 16 నుంచి 21 వరకు గుర్తించిన ప్రాంతాల్లో డెమానిస్ట్రేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్, యాప్ రూపొందించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రిజిస్ట్రేషన్ జరుపుతామన్నారు. మే 21 నుంచి 27వరకూ జిల్లాస్థాయిలో టిఒటిలను గుర్తించి శిక్షణ అందిస్తామని, 28వ తేదీ నుంచి మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, జూన్ 4 నుంచి 16 వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో శిక్షణ అందిస్తామన్నారు. మే 28 నుంచి జూన్ 3వ తేదీ వరకూ జిల్లా, మండల, గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని, వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లా, మండల, గ్రామ, వార్డుస్థాయిల్లో కమిటీలు నియమించామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, నగరమేయర్ పీలా శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జెసి మయూర్‌అశోక్, డిఆర్ఓ బిహెచ్ భవానీశంకర్ ఇతర అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకలో చిన్నారులు వేసిన ఆసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

యోగాసనాలు వేస్తున్న అధికారులు

ఏప్రిల్‌కు భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి

అక్టోబర్‌లో విశాఖ మెట్రో పనులు

దసరాకు టిడ్కో గృహాలు

పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. బుధవారం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చే ఏడాది ఏప్రిల్‌కి పూర్తి అవుతుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అనుసంధానం చేస్తూ 22 రోడ్లు ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు పూర్తి అవుతున్నాయని తెలిపారు. మిగిలిన ఆరు రోడ్లకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకుని కొత్త రోడ్లు నిర్మిస్తామని స్పష్టం చేశారు. టిడ్కో గృహాలు 2014-2019 మధ్య 7 లక్షల గృహాలు ప్రతిపాదించామన్నారు. టిడ్కో గృహాలు పూర్తి చేయాలంటే సుమారు ఏడు వేల కోట్లు అవసరమని, ఈ దసరాకి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరిచ్చేలా 2021 లో అమృతపథకం కోసం కేంద్రం నిధులిస్తే, గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వనందున ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్ళీ నిధులు వచ్చేలా చేశారని, 834 కోట్ల పనులు అమృత్‌పథకం కోసం నిర్దేశించామని చెప్పారు. విశాఖ మెట్రోకు సంబంధించి అక్టోబర్‌లో పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. విశాఖలో సెమీ రింగ్‌రోడ్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ తదితరులు

సమీక్ష సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్‌కుమార్, ఎపిఈపిడిసిఎల్ ఎండి పృథ్వీతేజ్, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, అతిథి గజపతిరావు, లోకం మాధవి, కె.లలితకుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీ మేయర్ గోవిందరాజు, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య రక్షక్ అవార్డుకు ఎంపిక

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు, కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ జీవవైవిధ్య రక్షక్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక అవార్డు అల్లూరి జిల్లాలోని మన్యం ప్రాంతాల్లో జీవవైవిధ్య పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా లభించింది. మే 22న విజయవాడలో జరిగే ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సత్యనారాయణ ఈ అవార్డును స్వీకరించనున్నారు. గత రెండు దశాబ్దాలుగా చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో గిరిజనుల జీవనోపాధి, సహజ వ్యవసాయం, సేంద్రీయ విధానాల పరిరక్షణ కోసం ఆయన సేవలందించారు. ఈ గుర్తింపు తమ సంస్థ ప్రయాణానికి ప్రేరణగా నిలుస్తుందని వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు.

28న మోడల్ డిఎస్‌సి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యుటిఎఫ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జరగనున్న మోడల్ డిఎస్‌సిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆర్ అంబేద్కర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె. సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, యుటిఎఫ్, డివైఎఫ్ఐ పోరాటంతో మెగా డిఎస్‌సి సాకారమైందన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నేతలు

ఈ నేపథ్యంలో ఉద్యోగార్థులకు దీనిపై అవగాహనకు విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన నమూనా ప్రశ్నాపత్రంతో ఎస్‌జిటి అభ్యర్థులకు మోడల్ డిఎస్‌సి నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.50ఫీజుతో తమ పేర్లను నమోదు చేసుకుని సద్వినియోగ పరచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఇతర, వివరాలకు 93989 70538, 63022 72862 ఫోను నెంబర్లక సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉమా శైలజ పాల్గొన్నారు.

సింహాచల దేవస్థానం ప్రధానార్చకులు రమణాచార్యులు గుండెపోటుతో మృతి



రమణాచార్యులు (ఫైల్)

ప్రజాశక్తి- పెందుర్తి :సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవాలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు (58) బుధవారం గుండెపోటుతో మరణించారు. రెండు రోజుల కిందట అనారోగ్యం తో ఆసుపత్రిలో చేరిన ఆయన, బుధవారం తెల్ల వారు జామున మృత్యువాత పడ్డారు. మూడున్నర దశాబ్దాల పాటు సింహాచలేశుని పూజాది కైంకర్యాలలో విశేష సేవలందించిన రమణాచార్యులు అకాల మరణం పట్ల దేవస్థానం ఉద్యోగులతో పాటు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. 98వ వార్డు పద్మావతి నగర్‌లోని రమణాచార్యుల ఇంటికి పలువురు వెళ్ళి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రమణాచార్యులకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రమణాచార్యుల మరణం తీరని లోటని ఆలయ వైదిక పెద్దలు, అధికారులు అన్నారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఎఇఒలు ఎన్ ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు గంట్ల శ్రీనుబాబు, సూరిబాబు, కప్పస్తంభంనాయుడు, ప్రసాద్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. రమణాచార్యులు సేవలను కొనియాడారు. అడవివరం శ్మశానవాటికలో అంత్య క్రియలు నిర్వహించారు..

సుకుమారన్ మృతికి సిపిఐ ప్రగాఢ సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకుడు, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ టి.ఎస్.సుకుమారన్ (76) మంగళవారం రాత్రి అనారోగ్యంతో విశాఖ ఎంవిపి.కాలనీ లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య వినోలియా, ప్రవీణ్, ప్రదీప్ ఇద్దరు కుమారులు ఉన్నారు. సుకుమారన్ మృతదేహాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు సి.హెచ్.రాఘవేంద్రరావు, అఖిలభారత ప్రొగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.చలం, సిపిఐ, బిఎస్ఎన్ఎల్, ఇస్కఫ్, విరసం నాయకులు కె.సత్యనారాయణ, సి.ఎన్.క్షేత్రపాల్, డి.మార్కండేయులు, బి.వెంకటరావు, ఎండి.బేగం, సి.హెచ్.కాసుబాబు తదితరులు నివాళులర్పించారు.

ఏర్పాట్లపై కలెక్టర్, పోలీస్‌కమిషనర్‌తో మాట్లాడుతున్న మంత్రి అనిత

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జూన్ 21వ తేదీన ప్రధాని విశాఖ పర్యటనలో భాగంగా ఏర్పాట్లను రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్షించారు. బుధవారం ఆర్కేబీచ్ రోడ్డు వద్ద విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, పోలీస్‌కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌లతో కలిసి ప్రత్యేకంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి భద్రత ఏర్పాట్లపై అధికారులకు పలుసూచనలు చేశారు. యోగా డేకు రాష్ట్రం నలుమూలల నుండి జనం భారీగా రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె సమీక్షించారు ప్రధాని పర్యటనలో అధికారులు సమన్వయంతో సమర్ధంగా పనిచేయాలని జిల్లా అధికారి యంత్రాంగాన్ని హోంమంత్రి ఆదేశించారు.

మగ్గం వస్త్రాలను చూపిస్తున్న నిర్వాహకులు

ఘనంగా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాహ, వేసవి సీజన్‌ను పురస్కరించుకుని భారతీయ చేనేత సాంప్రదాయ సంపూర్ణ వస్త్రాల ప్రదర్శన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను బుధవారం గ్రీన్‌పార్క్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివాహ వేడుకలకు సంప్రదాయం, ఆధునికత కలబోసిన వస్త్రాలు ఒకేచోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఈ రోజు నుండి 26వ తేదీ వరకూ 6 రోజులు పాటు ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిరకాల సిల్క్, కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి అన్నీ ఒకేచోట లభిస్తాయన్నారు.నేత కార్మికులు తమ వస్త్రాలపైన 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారన్నారు. ఈ ప్రదర్శనలో మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, గుజరాత్, తమిళనాడు, జమ్ముకాశ్మీర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుండి వచ్చిన పలుచీరలు లభ్యమవుతాయన్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితం అన్నారు. అన్నిరకాల డెబిట్, క్రెడిట్‌కార్డ్‌లు స్వీకరిస్తారని తెలిపారు.